ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం : వైసిపి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం ప్రభుత్వ బాధ్యారాహిత్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు విమర్శించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు ఇప్పటికే తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోయారన్నారు ప్రభుత్వం ఇప్పుడు కొనుగోలు చేస్తామని అంటోందని, ఇదేనా రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు వైసిపి పాలనలోనే 23 శాతం పూర్తయ్యాయన్నారు ఎయిర్ పోర్ట్ నిర్మాణం మేమే చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందని అన్నారు. మంత్రి కొండపల్లి గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్పా ఈ ప్రభుత్వంలో చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవివి సూర్యనారాయణ రాజు, ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు పీబండి జైహింద్ కుమార్, పాల్గొన్నారు

శాస్త్ర విజ్ఞానం పట్ల జిజ్ఞాస పెంచడమే లక్ష్యం

జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో జెవివి నాయకులు

ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గర్భాం మోడల్ స్కూల్, కుమరాం హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి విషయాన్ని ప్రశ్నించి సరైన సమాధానం రాబట్టి తెలుసుకోవడమే సరైన విద్య అని, అలా నేర్చుకునే విజ్ఞానమే శాస్త్రీయ విజ్ఞానమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు వి. రాజగోపాల్ అన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్థానిక సత్యా కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో రాజగోపాల్‌తో పాటు జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్ మాట్లాడారు. ప్రతి సంవత్సరం జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి సంబరాలు విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానం పట్ల జిజ్ఞాసను పెంచే ప్రయత్నమేనని చెప్పారు. చరిత్రలో అనేక శాస్త్రీయ ఆవిష్కరణలు జరిగిన సందర్భాల్లో శాస్త్రజ్ఞులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అయినా సత్యాలను నిర్భయంగా ప్రపంచానికి తెలియజేసేందుకు వారు తమ జీవితాలను త్యాగం చేశారని కొనియాడారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు సత్యం నాయుడు మాట్లాడుతూ పిల్లల్లో గ్రహణశక్తిని కొలవడానికి అనేక మార్గాలు వున్నాయని, వాటిని శాస్త్రీయంగా పెంచాలనే ఉద్దేశంతో జెవివి ఆధ్వర్యాన ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, గొర్లె రమేశ్ పలు సైన్స్ ప్రయోగాలు చేసి విద్యార్థులకు చూపి విజ్ఞానాన్ని, వినోదాన్ని కలిగించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా మధ్యాహ్నం జరిగిన ముగింపు సమావేశంలో విద్యార్థులకు అనేక ఇంద్రజాల అంశాలను ప్రదర్శించి రిటైర్డ్ ఉపాధ్యాయులు అచ్చిబాబు అలరించారు. అనంతరం ఈపు విజయకుమార్, సోమరాజు సారధ్యంలో బొండపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన "ఆరోగ్యమే మహాభాగ్యం నాటిక అందరినీ ఆకట్టుకుంది. సంబరాల్లో పాల్గొన్న టీమ్‌ల్లో మెరకముడిదాం మండలం గర్భాం మోడల్ స్కూలు విద్యార్థులు మొదటి స్థానంలోను, జామి మండలం కుమరాం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు రెండోస్థానంలోను, రేగిడి ఆమదాలవలస మండలం అంబఖండి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు మూడవ స్థానంలోనూ నిలిచారు. ప్రయివేట్ స్కూల్స్ లో విజయనగరం సన్ స్కూల్ మొదటి స్థానంలోను, రాజాం సన్ స్కూల్ రెండవ స్థానంలోను, గరివిడి గోదావరి షరాఫ్ స్కూల్ మూడవ స్థానంలోను నిలిచాయి. సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులందరికి సర్టిఫికెట్స్ తో బాటు మంచి పుస్తకాలను బహుకరించారు. ప్రజా కళాకారుడు డప్పు శ్రీను ఆలపించిన గీతాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు నీలయ్య, ఉపాధ్యక్షులు మురళీబాబు, నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శశిధర్, డాక్టర్ చిన్నారి, సాహితి స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ పాల్గొన్నారు.

జెవివి నాయకుల నుంచి సర్టిఫికెట్లు అందుకున్న జిల్లాస్థాయి పోటీల విజేతలు

క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి; పోటీలకు హాజరైన పలు జిల్లాల క్రీడాకారులు

రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో

బోణీ కొట్టిన విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో ప్రారంభమైన అండర్ 17 విభాగం బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా బాలికల జట్టు బోణీ కొట్టింది. ఆదివారం ఈ రాష్ట్రస్థాయి పోటీలను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని అన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలన్నారు. అనంతరం పావురాలు ఎగురవేసి, రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. మొదట విజయనగరం, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌కు టాస్ వేసి ఆటను ప్రారంభించారు. గుంటూరుపై విజయనగరం జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, ఎంఇఒ సత్యవతి, 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చన్నారు.

సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, జెసి సేధుమాదవ్, కర్రోతు తదితరులు

ఘనంగా సత్యసాయి శత జయంతి ఉత్సవం

సేవ చేయడమే పరమావధి అని చాటి చెప్పిన సాయి : మంత్రి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మానవుడిగా జన్మించినప్పటికీ తమ సేవా కార్యక్రమాల ద్వారా మహోన్నతుడిగా ఎదిగిన వ్యక్తి భగవాన్ సత్యసాయిబాబా అని రాష్ట్ర చిన్న సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సత్యసాయిబాబా శత జయంతోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అతిధులంతా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ సాటి మానవులకు సేవ చేయడమే జీవిత పరమావధి అని చాటి చెప్పిన వ్యక్తి భగవాన్ సత్య సాయిబాబా అని పేర్కొన్నారు. ఆయన బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ఎందరికో అనుసరణీయమని చెప్పారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ మానవత్వాన్ని చూపడం, తోటి వారికి సాయం చేయడమే సాయిబాబా బోధనల సారాంశమని పేర్కొన్నారు. తూర్పు కాపు చైర్పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ, విద్య, ఆరోగ్య సంస్థల ద్వారా లక్షలాదిమందికి సేవనందించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ డి.కీర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో...

శృంగవరపుకోట : సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను మండలంలోని చిన కండేపల్లి వద్దగల సాయి పల్లెలో ఆదివారం ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, ఎపి సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.మండలంలోని తాటిపూడి వద్ద శ్రీ సత్యసాయి సేవా సెంటర్ ట్రస్ట్ ద్వారా నిరంతరం ఆరోగ్య, విద్య, అన్నదాన సేవలు అందిస్తూ ప్రజల మనసులను దోచుకుంటు న్నారని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో అత్యాధునిక క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం చేపట్టిన కుమార్ బాబా సేవలు అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి, ఆరోగ్య సేవలు, విద్యా ప్రోత్సాహం మనస్ఫూర్తిగా చేయాల్సిన సేవలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



జంఝావతి రబ్బర్‌డ్యామ్ వద్ద
ముగ్గురు గల్లంతు

ప్రజాశక్తి- కొమరాడ, కురుపాం

మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్‌లో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. శివిని గ్రామంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి ఇతర ప్రాంతాల్లో ఉంటున్న గ్రామానికి చెందిన స్నేహితులంతా రావడంతో సరదాగా సాయంత్రం రబ్బరు డ్యామ్ వద్దకు వెళ్లి నదిలో దిగడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది.

కొమరాడ మండలం శివిని గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రాయగడ శరత్‌కుమార్ (17), అరసాడ ప్రతాప్ (29), అధికార గోవిందనాయుడు (35) ఆదివారం సాయంత్రం జంఝావతి రబ్బరు డ్యామ్‌లో స్నానానికి దిగి గల్లంతయ్యారు. శనివారం శివిని గ్రామంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఇతర ప్రాంతాల్లో ఉంటున్న పలువురు యువకులు వచ్చారు. గ్రామంలో ఉంటున్న శరత్‌కుమార్, ప్రతాప్‌తోపాటు ఇతర ప్రాంతంలో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్న గోవిందనాయుడు, మరో ఐదుగురు స్నేహితులతో కలిసి కోసం జంఝావతి రబ్బరు డ్యామ్ దిగువన నదిలో స్నానానికి దిగారు. రబ్బరు డ్యామ్‌పై నుంచి నీరు ప్రవహించే ప్రదేశంలో దిగువన గోతులు ఉండడాన్ని గమనించలేదు. ఈ నేపథ్యంలో శరత్‌కుమార్ తొలుత మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రతాప్, గోవిందనాయుడు కూడా దిగి కొట్టుకుపోయారు. సమీపం నుంచి చూస్తున్న తోటి స్నేహితులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే వారు మునిగిపోయి కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటనతో గ్రామంలోనూ, కుటుంబ సభ్యుల్లోనూ తీవ్ర విషాదం అలముకుంది. విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం ఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరుకొని మునిగిపోయిన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. పార్వతీపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఇరిగేషన్ సిబ్బంది.. నీటిని వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన కాలువ గుండా మళ్లించారు. యువకుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో గ్రామస్తుల్లోనూ కుటుంబ సభ్యుల్లోనూ విషాదఛాయలు అమలుకున్నాయి.

కుటుంబ నేపథ్యం

గోవింద నాయుడు.. గ్రామంలోని వెల్డింగ్ షాప్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన తండ్రి చనిపోగా తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలు రెండు, మూడో తరగతులు చదువుతున్నారు.

శరత్‌కుమార్.. పార్వతీపురం పట్టణంలోని ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శరత్‌కు అన్నయ్య తుశాంత్ ఉండగా ఇద్దరూ ఒకే కళాశాలలో ఒకే తరగతి చదువుతున్నారు.

ప్రతాప్.. గ్రామంలో స్నేహితుని వివాహం కోసం రాగా ఈ సంఘటన జరిగింది. మచిలీపట్నంలో రొయ్యల చెరువులో పనిచేస్తున్నాడు. తండ్రి వ్యవసాయ కూలీ కాగా, అన్నయ్య విశాఖపట్నంలో ప్రయివేటు ఉద్యోగం, చెల్లి ఊరిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

లేబర్ కోడ్‌లను నిలిపివేయాలి

26న కలెక్టరేట్ వద్ద ధర్నాకు కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు ఇచ్చిన నోటిఫై ఫైల్స్ తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, కోశాధికారి ఎ.జగన్మోహన్‌రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్.రంగరాజు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి ఎం కౌశిక్, నాయకులు ఎ.మధు, ఎఐసిటియు జిల్లా కన్వీనర్ ఎం.అప్పలరాజు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాడు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేసి అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం నోటిఫై చేసిందని, ఈ కోడ్‌లతో కార్మికులకు లాభం కంటే నష్టమే ఎక్కువ అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, వారికి మద్దతుగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయని, జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కోట్లాదిమంది కార్మికులు పాల్గొని నిరసన తెలిపారని వివరించారు. అయినా మోడీ ప్రభుత్వం బీహార్ ఎన్నికల అనంతరం వీటి అమలుకు మొండిగా ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపి కలిసి లేబర్ కోడ్‌లను బలపరుస్తున్నాయని మండిపడ్డారు. ఇవి అమల్లోకి వస్తే కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం లేదని, గ్రాడ్యుటీ, బోనస్, హెచ్‌ఆర్,ఐ ఆర్ వంటి చట్టాలకు తూట్లు పొడిచారని, కార్మిక శాఖ పర్యవేక్షణపై ఆంక్షలు విధించి దాని కోరలు పీకేసారని, జీతం, సౌకర్యాల కల్పన యజమానుల ఇష్టానికి వదిలేసారని, సంఘం పెట్టుకునే హక్కు, బేర సారాలు ఆడే హక్కు ఉండవని తెలిపారు. 8గంటల పని దినాన్ని 10నుంచి 12 గంటలకు పెంచడం ద్వారా కార్మికులపై పని భారంతో పాటు, నిరుద్యోగం పెరుగుతుందని, లేబర్ కోడ్‌లతో యజమానులకు తప్ప , కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ లేదని తెలిపారు. ఈనేపథ్యంలో ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేసి. మావోయిస్టులపై జరుగుతున్న హింసాత్మక బూటకపు ఎన్‌కౌంటర్ల పై న్యాయ విచారణ చేపట్టాలని పలువురు వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బొబ్బిలిలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ. సిపిఎం. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ఆపరేషన్ కగారు పేరుతో అమాయకపు గిరిజనులను పొట్టన పెట్టుకుంటోందని, గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్న నాయకులను ఎన్‌కౌంటర్ల పేరిట మావోయిస్టులను అంతం చేయాలని మోడీ, అమిత్ షా ప్రయత్నిస్తున్నారని అన్నారు. చర్చలకు వస్తామని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దండకారణ్యంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను దారా దత్తం చేయడానికి మావోయిస్టులను ఎన్‌కౌంటర్లు చేస్తోందని అన్నారు. ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ చేపట్టాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొట్నూరు శంకర్రావు. సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి పోల ఈశ్వరరావు, ఎం.గోపాలం, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి తమటాల అప్పలనాయుడు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న. విద్యార్థి జెఎసి రాష్ట్ర కార్యదర్శి బీశపు సాయికిరణ్ యాదవ్, రైతు సంఘం నాయకులు ఎస్. గోపాలం. కలాసీ సంఘం నాయకులు ఎన్.తవిటినాయుడు, పిల్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి రమణ

సిపిఐ ఆధ్వర్యాన నిరసన

విజయనగరం టౌన్ : ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపాలనే ఉద్దేశంతో వచ్చిన మావోయిస్టు నేతలను ఆసుపత్రి నుండి తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ పేరిట చంపటం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి. కామేశ్వరరావు అన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం స్థానిక అంబేద్కర్ జంక్షన్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడారు. విజయవాడ, ఏలూరు, ఇతర ప్రాంతాలలో నిర్బంధించిన మావోయిస్టులను, అమాయక గిరిజనులను వెంటనే న్యాయస్థానాల ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి 31 కి మావోయిస్టు రహిత ప్రాంతంగా మారుస్తామని, ఆపరేషన్ కగార్ లో అంతర్భాగంగా మోడీ, అమిత్ షా లు నర మేధానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- పొదుపు, అప్పు వివరాలు తెలుసుకునేందుకే 'మన డబ్బులు-మన లెక్కలు'
- ఈ ఏడాది రూ.282 కోట్ల స్త్రీనిధి రుణాలు లక్ష్యం
- 'ప్రజాశక్తి'తో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా వెలుగు, డిఆర్‌డిఎ పనిచేస్తున్నాయని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ పాణి తెలిపారు. సమాజంలో మహిళలు గొప్ప శక్తిగా ఎదుగుతున్నారని, ఆ ఎదుగుదలకు అన్ని విధాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతూ వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లా వ్యాప్తంగా ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు?

జిల్లా వ్యాప్తంగా 40,153 పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిలో 4 లక్షల 32వేల 654 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

ఈ ఏడాది ఇప్పటివరకు ఎన్ని పొదుపు సంఘాలకు ఎంత రుణాలు మంజూరు చేశారు?

ఈ ఏడాది రుణాల లక్ష్యం రూ.6.64 లక్షల రూపాయలు రుణాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.5.85కోట్లు రుణాలు ఇచ్చాం. ఈ ఏడాది సంవత్సరం నుంచి బ్యాంకు రుణాలు సభ్యుల అవసరాల మేరకు అందిస్తాం. ఇందులో సభ్యులకు ఒకరికి పదివేల నుంచి లక్ష వరకు అందజేస్తున్నాం. మహిళలకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఎస్‌హెచ్‌జి వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళిక ప్రతి కుటుంబానికి చేపట్టాం. మొబైల్ యాప్ ద్వారా ప్రణాళిక తయారు చేశాం. వీటి లక్ష్యం 13,762సంఘాలకు రూ.845కోట్లు అవసరం కాగా, ఈ అక్టోబర్ నాటికి 5754 సంఘాలకు రూ.599 కోట్లు రుణాలు బ్యాంకు నుంచి మంజూరు చేశాం.

వెలుగు ద్వారా చేపడుతున్న విధులు, పథకాలు ఎలా ఉన్నాయి? వాటి ద్వారా మహిళలకు ఏ విధంగా తోడ్పాటు అందిస్తున్నారు?

వెలుగు ద్వారా సుమారు 12 రకాలైన విధులు నిర్వర్తిస్తున్నారు. సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీ, ఉన్నతి, ఐసిఎఫ్ సామాజిక పెట్టుబడి నిధి , స్త్రీ నిధి, హెచ్‌డిఐఎఫ్ హెల్త్ డెవలప్మెంట్ ఫండ్, ఎఫ్‌పిఒ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, జీవనోపాధులు, హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఫంక్షన్స్, ఫైనాన్స్, హెచ్‌ఆర్ వంటి విధులు నిర్వహిస్తున్నాం. వాటిలో ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి రుణాలు ఇస్తున్నాం.

వికలాంగుల పింఛన్లకు సంబంధించి సదరన్ రీ వెరిఫికేషన్ జిల్లా వ్యాప్తంగా ఎన్ని చేపట్టారు? వాటి పరిస్థితి ఏమిటి?

జిల్లా వ్యాప్తంగా సదరం సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్‌కు 7300 పేర్లు వచ్చాయి. జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 2,72,986 మందికి వస్తున్నాయి. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,34,329, వితంతు పింఛన్లు 72,063, వికలాంగ పింఛన్లు 35,874, అభయ హస్తం పింఛన్లు 10,330, ఒంటరి మహిళ 5161, డప్పు కళాకారులు 4083, నేత కార్మికులు 2920 తదితర పింఛన్లు ఉన్నాయి.

స్త్రీ నిధి కింద ఈ ఏడాది ఎన్నికోట్లు రుణాలు మంజూరు చేశారు? వాటి రికవరీ శాతం ఎలా ఉంది?

ఈ ఏడాది లక్ష్యం 28,298 మందికి రూ.282.86 కోట్లు ఇవ్వవలసి ఉండగా ప్రస్తుతానికి 18,634 మందికి రూ.168 కోట్ల 70 లక్షలు స్త్రీ నిధి రుణాలు అందజేశాం. రికవరి శాతం బాగానే ఉంది.

ఇటీవల చేపట్టిన మన డబ్బులు..మన లెక్కలు కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మన డబ్బులు మన లెక్కలు అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. పొదుపు, అప్పు వివరాలు వాయిదాల సంఖ్య, నెల సరి వాయిదా, మొత్తం అప్పు, నిల్వ ఎంత ఉంది అనేది ప్రతి నెలా ప్రతి ఒక్కరూ తమ సొంత వివరాలతో పాటు గ్రూప్ వివరాలు కూడా తెలుసుకోవచ్చు. ఇలా చూసుకోవడానికి సభ్యులకు ప్రతి ఒక్కరికీ 20 అంకెల ఐడి ఇస్తాం. యూసర్ నేమ్ పాస్వర్డ్ కింద ఐడిలో చివరి 4అంకెలను టైప్‌చేసి వివరాలు తెలుసు కోవచ్చు. దీనిపై గ్రామస్థాయిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

మహిళా మార్ట్‌ల పరిస్థితి ఏమిటి?

జిల్లాలో శృంగవరపుకోట, చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన మహిళా మార్టులు బాగానే నడుస్తున్నాయి. మిగతా మండలాల్లో కూడా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇంకా ఒక కొలిక్కి రాలేదు.

స్వయం ఉపాధి కల్పనకు సంబంధించి మహిళలకు ఏమైనా శిక్షణ అందిస్తున్నారా ?

ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ నడుస్తోంది. అనేక విధాలుగా స్వయం ఉపాధి సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి నిరంతరం వెలుగు-డిఆర్‌డిఎ కృషి చేస్తున్నాయి.

ప్రభుత్వ బడికి ఉరి తాడు..!

◆నిలిచిన నాడు - నేడు పనులు ◆దాతల కోసం ఎదురు చూపులు ◆మూలకు చేరుతున్న సదుపాయాలు ◆ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

నాడు ప్రభుత్వ బడులు అభివృద్ధికి నోచుకుంటే. నేడు తరగతి గదులు శిథిలావస్థకు చేరుతున్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో కోట్లాది రూపాయలు బడి అభివృద్ధికి ఖర్చు చేస్తే.. నేడు బడి బాగుకు దాతలు కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు దాపరించాయి. దాతలు లేని చోట పాఠశాల గదులు, బడి ప్రాంగణాలు శిథిలావస్తకు చేరుతున్నాయి. నాడు - నేడు పథకాన్ని కూటమి ప్రభుత్వం 'మన బడి - మన భవిష్యత్తు' అని పేరు మార్చిన విషయం తెలిసిందే. కానీ నాడు మంజూరు చేసిన నిధులను కూడా కూటమి ప్రభుత్వం నిలిపేసింది. దీంతో పాఠశాలలు శిథిలావస్థకు చేరి దాతలు కోసం ఎదురుచూస్తున్నాయి.

ప్రజాశక్తి - జామి

మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 9 ఉన్నత పాఠశాలు (కేజీబీవితో కలిపి) 52 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఈ ఏడాది 2,736 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు- నేడు పథకం కింద తొలి విడతలో 20 బడులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 4.09 కోట్లు వరకు ఖర్చు చేసింది. రెండో విడతలో 6 అంగన్వాడీలను కలుపుకొని మొత్తం 29 బడులను అభివృద్ధికు నిధులు కేటాయించింది. అయితే 13 ప్రాథమిక బడులకు ఒక్కో బడిలో రూ.10 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు ఖర్చు చేసింది. హైస్కుల్ అభివృద్ధికి సుమారుగా రూ. 30 లక్షలు ఖర్చు చేసింది. చివరకి అంగన్వాడీల అభివృద్ధికి మూడేసి లక్షలు వరకు గత ప్రభుత్వం ఖర్చు చేసింది. మూడో విడత కూడా బడులు గుర్తించి, అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, కూటమి ప్రభుత్వం వచ్చాక నాడు నేడును నిలుపుదల చేసి ఒక్క పైసా ఖర్చు బెట్టని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే బడులు అభివృద్ధికి దాతల చేయూత కోసం ఎదురు చూస్తున్నాయి.

శిథిలావస్థకు చేరిన చింతాడ ప్రాథమిక పాఠశాల

దాతల లేని చోట ప్రభుత్వ బడులు పూర్తిగా శిథిలమవుతున్నాయి.

మండలంలోని చింతాడ ప్రాథమిక పాఠశాల వంట గది లేక ఉన్న తరగతి గదులు పెచ్చులూడిపోయి, శిథిలావస్థకు చేరింది. ఇలా మండలంలో అనేక బడులు బోధనకు అసౌకర్యంగా మారుతున్నా, ప్రభుత్వం పట్టించుకునే పాపాన పోలేదు. దీంతో ఏటా వందల సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమవుతున్నారు. సుమారు ఏటా 300 మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులకు ఇదే పరిస్థితి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పేరు ఏదైనా బడుల అభివృద్ధికి నిధులు విడుదల చేయకుంటే, ప్రభుత్వ పాఠశాలలు మరింత దయనీయ పరిస్థితికి చేరుకుంటాయని ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత మూడేళ్లలో తగ్గిన విద్యార్థులు తీరు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2023	3,299
2024	3,011
2025	2,736

జామి హైస్కుల్ గేట్లకు ఆర్థిక సాయం

జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తరగతి గదుల నిర్వహణకు గేట్లు అవసరం కాగా, గ్రామ పెద్ద బండారు చినబాబు తన కుమార్తె వేణుమాధవి పేరిట రూ.50 వేల నగదును అందజేసి గేట్లు ఏర్పాటు చేశారు. ఇలా సామాజిక స్పృహ కలిగిన దాతలు ముందు కొచ్చి, ప్రభుత్వ బడిని కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.

ఎన్‌సిసి అధికారి శ్రీనివాసరావును అభినందిస్తున్న డిఎస్‌పి రాఘవులు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు : డిఎస్‌పి

ప్రజాశక్తి - చీపురుపల్లి

విద్యార్థి దశ నుంచి ఎన్‌సిసిలో క్రమశిక్షణను అలవరచుకొని ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు సూచిం చారు. 77వ ఎన్‌సిసి దినోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి అధికారి మామిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిఎస్‌పి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఎన్‌సిసి వంటి శిక్షణను తీసుకోవడం వల్ల విద్యార్థులలో శారీరిక మానసిక ధృడత్వం లభిస్తుందన్నారు. ఎన్‌సిసిలో చేరడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థీ క్రమశిక్షణ, ఐకమత్యం, నిబద్ధత వంటి విషయాలను సులువుగా అలవర్చుకోగలరన్నారు. ఈ సందర్భంగా తాను ఎన్‌సిసి విద్యార్థిగా 40 ఏళ్ల క్రితం అలవర్చుకున్న కొన్ని అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు జరిపిన విన్యాసాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.శంకర్రావు, ఎస్ఐ ఎల్.దామోదర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమామహేశ్వరి, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, పాఠశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - రాజాం

రాజాంలోని జిఎంఆర్ ఐటి క్రీడా ప్రాంగణంలో రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు సిబ్బందికి ఆహారం-ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా ట్రైనర్ కొరికాన శ్రీనివాసరావు యోగాసనాలు, ప్రాణాయామం, యోగా నిద్ర సాధన చేయించి, ఆరోగ్యకర ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, రేగిడి, సంతకవిటి, వంగర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి వినతి పత్రాన్నిస్తున్న టిడిపి నాయకులు రాజారావు, బాబూరావు

సారిపల్లి సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నియోజకవర్గం బిసి కమిటి అధ్యక్షులు సారిపల్లి బాబురావు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి ఆదివారం విజయనగరంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామతీర్థసాగర్ రిజర్వాయర్ గట్లను సారిపల్లి గ్రామ కొండకు తాకించకుండా నిర్మాణం చేపట్టాలని, నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌ఆర్ ప్యాకేజిలో 1500 కుటుంబాలకు పిఎఫ్ మంజూరు చేయాలని కోరారు. 15.40ఎకరాల భూమి డబ్బులను కోర్టు ద్వారా కాకుండా కలెక్టర్ ద్వారా ఇప్పించాలని కోరారు. కోరాడపేట, ఆత్మరాముని అగ్రహారం, పడాలపేట గ్రామాలకు పిఎఫ్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని రాజారావు తెలిపారు.

గోపాలరావుకు నివాళి

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని గుర్ల గ్రామంలో రాకోటి గోపాలరావు నాలుగో వర్ధంతి సభను ఎపిటిఎస్ మండల కార్యదర్శి డి.గంగాధర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జనవిజ్ఞాన వేదిక నాయకులు గండ్రేటి అప్పల నాయుడు, రెడ్డి రాజగోపాల్, లోతుగెడ్డ మాజీ సర్పంచ్ అగతాన త్రినాథ్, సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, గోపాలరావు సతీమణి రాకోటి పాప, రాకోటి రామకృష్ణ, తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

గోపాలరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

బుద్ధవనంగా సుందరీకరణ

ప్రజాశక్తి - వేపాడ

బ్రిటీష్ కాలం నాటి వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను బుద్ధవనంగా సుందరీకరించారు. పోలీసు స్టేషన్, క్వార్టర్స్ చుట్టూ ముళ్ళ పొదలతో ఇబ్బందికరంగా ఉండటంతో ఎస్ఐ సుదర్శన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముళ్ళ పొదలను తొలగించి స్టేషన్ ఆవరణలో ఉన్న బుద్ధ విగ్రహాన్ని సుందరీకరించారు. విగ్రహం చుట్టే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించిన ఎస్ఐను పలువురు అభినందిస్తున్నారు.



సుందరంగా తయారైన బుద్ధవనం ఇదే..

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- డెంకాడ

అనారోగ్యంతో బాధపడుతున్న డెంకాడ గ్రామానికి చెందిన చల్ల హేమంత్‌కుమార్‌కు సిఎం సహాయనిధి చెక్కు రూ.1.10లక్షలను మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, మహంతి చిన్నంనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర రావు, మండల తెలుగు యువత జనరల్ సెక్రటరీ బుజ్జి నాయుడు, డెంకాడ గ్రామ పార్టీ అధ్యక్షులు సిరికి మహేష్, జనరల్ సెక్రటరీ స్వామినాయుడు, ప్రదీప్ రాజు పాల్గొన్నారు.

అంగీకార పత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఆయన కళ్లు సజీవం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస పంచాయతీ పరిధిలోని గొండయ్యపాలెం గ్రామానికి చెందిన ఎర్నింటి కనకారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులు కనకారావు చూడలేని లోకాన్ని మరో ఇద్దరు చూడొచ్చన్న ఆలోచనతో మన మాతృభూమి సేవా సంఘం న్యాయ సలహాదారులు ఎర్నింటి కృష్ణ విన్నపం మేరకు మృతిని భార్య సూరమ్మ, కొడుకు వాసు తన తండ్రి కనకారావు కళ్ళ దానం చేసేందుకు అంగీకారం తెలిపి మనిషికి మరణం ఉంటుంది కానీ మానవత్వానికి మరణం లేదని నిరూపించారు. దీంతో కనకారావు కుటుంబ సభ్యులకు ఆదివారం మాతృభూమి సేవా సంఘం సభ్యులు అంగీకార పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు.

తాగునీటి బోర్లు బాగు చేయండి

వంగర: మండలంలోని విఆర్‌పేట పంచాయతీలో ఎస్‌సి వీధి, బీసీ కాలనీలో ఉన్న రెండు తాగునీటి బోర్లు, ఇదే పంచాయతీలోని జెకె గుమ్మడలో గల మెయిన్ సెంటర్లో ఉన్న తాగునీటి బోరు రెండు నెలల క్రితం మరమ్మత్తులకు గురైంది. దీంతో ఆ పంచాయతీ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మూడు బోర్లను బాగు చేసి తాగునీరు అందించాలని ఆ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, రైతులు ప్రభుత్వం ఆధీనంలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. మండలంలోని సతివాడ గ్రామంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ముందుగానే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీకాంత్, సిఎస్‌డిటి ఆర్. శంకరరావు, చీపురుపల్లి ఎడిఎ ఎన్.కోటేశ్వరరావు, ఎఒ పి.శ్రీలక్ష్మి, జనసేన సీనియర్ నాయకులు చనమల్ల వెంకట రమణ, అంబళ్ల అప్పలనాయుడు, ఎంఎం నాయుడు, యడ్ల గోవింద రావు, కరుమజ్జి గోవింద, పతి వాడ అచ్చుం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నగర పంచాయతీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగర పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శంకుస్థాపన చేశారు. విఎంఆర్‌డిఎ నిధులతో 1,16,17,18,19,20వార్డుల్లో రూ.44.50లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, ముడుమంచి లక్ష్మణరావు, జనసేన నాయకులు ఎంఎం నాయు డు, జనా ప్రసాద్, కమిషనర్ ఎస్.జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

మెరకముడిదాం: టిడిపి కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు.

మెరకముడిదాం: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లిక్‌నాయుడు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. మండలంలోని శాతం వలసలో రైతు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నల కోసం పంట చేతికొచ్చిన ఈ కీలక సమయంలో దళారుల దోపిడీని అరికట్టి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడటం కోసం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్ కాపీలు దహనం

ప్రజాశక్తి-బొబ్బిలి

లేబర్ కోడ్ నోటిఫికేషన్ కాపీలను సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శానిటేషన్ మస్తర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 29 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలలోకి తేవడం అన్యాయమన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలకు కార్మికుల శ్రమను దోచిపెట్టడానికి కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఈ నాలుగు లేబర్ కోడ్లు అమలు చేయడానికి పూనుకుందన్నారు. కార్మికులకు పని భద్రత లేకపోగా 12 గంటల పని సమ్మె హక్కు లేకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. బ్రిటిష్ వాడికంటే దుర్మార్గంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఈ చట్టాలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు యుగంధర్, జి.గౌరీ, జి.వాసు, బి.వెంకటి, కార్మికులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని వైఎస్ ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లిమర్లలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కార్మిక వర్గంపై యుద్ధభేరి మోగించిందని, స్వాతంత్ర్యం తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కొత్త కార్మిక కోడ్‌ల ద్వారా హరిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వేతన బోర్డుల్లో కార్మిక సంఘాల ప్రతినిధులు సభ్యులుగా ఉండేవారని, కొత్త చట్టాలలో కార్మిక సంఘాలకు చోటు లేకుండా చేస్తున్నారని చెప్పారు. కార్మికులపై మోడీ ప్రభుత్వ దాడులకు నిరసనగా ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనకు వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షులు నడిపేన సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు నాయకులు

గెలుపే లక్ష్యం కావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మెరకముడదాం మండలం బుధరాయవలస గ్రామం నుంచి 400 కుటుంబాలు, ఎస్ఎంవలస గ్రామం నుంచి సుమారు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే కళా వెంకటరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బుదరాయవలసి నాయకులు బాలి బంగారునాయుడు, ఎస్ఎంవలస నాయకుడు దాసరి రాములను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం టిడిపి మండల నాయకులు తాడి సన్యాసినాయుడు, కోట్ల మూతిలాల్ నాయుడు, తాడి చంద్ర, సుబ్బరాజు, రెడ్డి గోవిందా, చంటి సన్యాసినాయుడు, నాని తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: టిడిపిలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన 50 వైసిపి కుటుంబాలు ఆదివారం వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో బైరాగి వర్మరాజు, బైరాగి మురళి రాజు, ఎంఎస్ఎన్ రాజు తదితరులు పార్టీ కండువాలను కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బూడి అప్పలనాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు మురళీరాజు, గ్రామ సర్పంచ్ భవిరి శెట్టిరామారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీలకు లక్కవరపుకోట మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాను లోహిత్, టేకు దుర్గా భవానీలు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆదివారం తెలిపారు. ఇటీవల కొత్తవలసలో జరిగిన ఎంపిక పోటీల్లో సత్తా చాటి ఎంపికయ్యారని వీరు ఈ నెల 24వ తేది నుంచి 26వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగబోవు రాష్ట్ర స్థాయి అండర్14 బాల బాలికల బాస్కెట్ బాల్ పోటీలలో విజయనగరం జిల్లా బాల బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన ఈ క్రీడా కారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఉప ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు, ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి మహేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు బర్నికాన వెంకట్రావు, అభినందించారు.

క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వేపాడ: ఇటీవల వేపాడ మండల శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో బక్కునాయుడుపేట ఆదర్శపాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. గ్రంథాలయ అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటారు. పాఠశాలకు చెందిన ఎం.అరవింద్ వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఎం.లాస్య, చాందిని కన్సోలేషన్ బహుమతులు, క్విజ్ పోటీల్లో తమ ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరిని పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు ఆదివారం అభినందించారు.

వేపాడ: వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులు

మొక్కలు నాటిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ ఎస్. కోట బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి.వరలక్ష్మి ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయం కోనేరు గట్టుపై 10 పనస మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న ప్రధాన అంశాలలో కాలుష్య నివారణ అంశంలో భాగంగా మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంసి మెంబెర్ డి.సూర్యారావు, వైస్ చైర్మన్ మల్లేశ్వరరావు, బ్రాంచ్ సెక్రటరీ జి. ధనుంజయ్, ఎంసి మెంబర్స్ కొండలరావు, జోగారావు, దుర్గాప్రసాద్, గణేష్ కుమార్, గిరిజసుందరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అప్పారావు, శ్యామ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆ శాఖ జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం స్థానిక ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎస్.వి. రమణ హాజరయ్యారు. సమావేశంలో విద్యా రంగంలోని ప్రస్తుత సమస్యలు, ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన సంఘ కార్యకలాపాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా కౌన్సిల్ ఏకగ్రీవంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షులుగా వై.అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా డి.శ్యామ్, ఉపాధ్యక్షులుగా డి.శ్రీరాములు, ఎస్.నారాయణరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉమా మహేశ్వరరావు, ఆర్థికకార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్‌దొర, కార్యదర్శులుగా ఇ.అప్పలనాయుడు, జి.నారాయణరావు, వి.సౌధమని, పి.ఆదిలక్ష్మి, ఎల్.వసుంధర, ఎం.అన్నపూర్ణ, రాష్ట్ర కౌన్సిలర్‌గా వి. గోవిందరావు, సిపిఎస్ కన్వీనర్‌గా సిఎస్‌వి నాయుడు ఎన్నికయ్యారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

9న ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు ఆత్మీయ కలయిక డిసెంబర్ 9న రామనారాయణ సమీపంలోని తోటలో జరుగుతుందని ఆ సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోట్ల పైడిరాజు, కర్రి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం పిఎస్ఆర్ కాంప్లెక్స్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ఆత్మీయ కలయికలో ఆటపాటలతోపాటు సాంస్కతిక కార్యక్రమాలతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామీణ వైద్యుడు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి గుప్తా, ఉపాధ్యక్షులు మక్కువ రమణ, సిటీ ఇన్చార్జ్ సీతారాం, మహిళా అధ్యక్షు రాలు భవాని, కార్యవర్గ సభ్యులు ఝాన్సీ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRUCT JUDGE AT VIZIANAGARAM GUARDIAN O.P 17/2025

BETWEEN :
BHOOMIREDDI NAIDU ....PETITIONER
AND
PYLA DEMUDAMMA ....RESPONDENT

GENERAL NOTICE

To
The General Public who may concern

General Public are hereby informed that the above petitioner sri Bhoomi reddi Naidu filed above G.O.P praying the Honourable Court to appoint him as a GUARDIAN TO HIS SON BY NAME BHOOMIREDDI VEDHANSH and to accord permission to see his welfare on all aspects . The above matter was posted to **27/11/2025,** for appearance and to file objections on the above date at **10.30 A.M** before the above said honourable court and if any one have any objections they can file their objections before the honourable court on the above said date and time, else the matter will be decided on the material available on records

By order of theHonourable court

GALLA. ESWARA RAO
A.SRINIVASARAO
Advocates, Mobile
No: 9949600278
Advocates for the Petitioner

Vizianagaram
Dt: 24/11/2025

IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM S.O.P. 11/2025

Between:
Karanam Sanyasamma
.......Petitioner/Plaintiff
And
The Superintendent (Postal Dept) Head Post Office, Vzm
.....Respondent

General Notice

Please take notice that the Petitioners filed the above petition to issue succession Certificate in their favor on the death of Rokkam Varalaxmi and the same is posted to 10.12.2025. If anybody have got objections attend before the Hon'ble Court on **10.12.2025 at 10:30 AM** and submit your objections. If any failing which the matter will be determined in your absence.

J. Bheema Sena Rao
P. Chandra Rao
Advocate, Vizianagaram
Cell: 9441306665

మహారాజశ్రీ విజయనగరం సీనియరు సివిల్ జడ్జి వారి కోర్టులో IA 166/2016 OS 156/2011

Between:
Kondeti Satyavathi ......Petitioner
And
Machupalli Bhaskara Rao (died) and others.
....Respondents

To
R4) Machupalli Saraswathi W/o late Bhaskara Rao, D No 27-1-12, Kapu Street Dasannapeta, Vizianagaram.
R5) Machupalli Paramesh S/o late Bhaskara Rao, D No 27-1-12 Kapu Street, Dasannapeta, Vizianagaram.
R6) Machupalli Purnima D/o late Bhaskara Rao, D No 27-1-12, Kapu Street, Dasannapeta, Vizianagaram
R7) Machupalli Bhanukumari D/o late Bhaskara Rao D No 27-1-12, Kapu Street, Dasannapeta, Vizianagaram

పై నెంబరు పిటిషన్‌లో మీకు అనేక సార్లు పై కోర్టు వారిచే నోటీసులు పంపినా మీరు తీసుకోనందున సదరు పిటిషను మీకు నోటీసు నిమిత్తం తే.3-12-2025 కి వాయిదా వేసినారు. సదరు పిటిషన్ లో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల **తే 3.12.2025 న ఉదయం 10.30 గంIIలకు** కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J. Bheemasena Rao
Advocate for Petitioner
Vizianagaram , Cell: 94410 53628

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, బొబ్బిలి ఓ.ఎస్. 123/2024

ఉప్పల నాగరాజు ....వాది
మరియు :
లంక గౌరీ శంకరరావు ....ప్రతివాది

ప్రతివాది : లెంక గౌరీ శంకరరావు, తండ్రీ లేటు నారాయణ అప్పడు, వయస్సు 44 సంవత్సరాలు, రెవిన్యూ కాలనీ, కే.ల్.పురం, విజయనగరం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో వాది అయిన ఉప్పల నాగరాజు మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, బొబ్బిలిలో దాఖలు చేసిన దావా ఓ.యస్. నెం. 123/2024 నెంబరు దావాలో మీరు ప్రతివాదియై ఉన్నారు. సదరు దావాలో నోటీసులు జారీ కాబడినప్పటికి మీరు నేటి వరకు హాజరు కానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయంపించి యున్నారు. సదరు దావా **తే.29.12.2025ది** నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలోను మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహా పై వాయిదా తేదీన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదీన హాజరు కాకుండ తప్పి పోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ,
ఏడ్వోకేట్, బొబ్బిలి,
విజయనగరం జిల్లా,
సెల్ : 9440592366.